


# శోభాయమానంగా పుష్పపల్లకీ సేవ

**శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప అభయం**

**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం సాయంత్రం సాలకట్ల ఆణివార ఆస్థానం సందర్భంగా పుష్పపల్లకీ సేవ వైభవంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన పల్లకీపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, పేష్కార్ శ్రీహరి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# టిటిడి ఛైర్మన్ రేసులో పలువురు

## ప్రముఖంగా.. అశోక్ గజపతిరాజు పేరు

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

**తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డ్‌కి పలురు పోటీపడుతున్నారు.. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించడంతో ప్రధానంగా టిడిపి, జనసేన పార్టీల నుంచి డజను మందికి పైగా పోటీ పడుతున్నారు. ముఖ్యంగా టిడిపి నుంచి కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు, సినీనటుడు మురళీ మోహన్ కూడా క్యూలో ఉన్నట్లు సమాచారం. జనసేన నుంచి కొణిదెల నాగబాబు, మండలి బుద్ధప్రసాద్ పోటీ పడుతున్నారు..**

**ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి ధార్మిక సంస్థకు ఛైర్మన్ అంటే ఆ పదవికి ఎనలేని క్రేజ్. రాష్ట్ర క్యాబినెట్ మంత్రితో సమానమైన పదవి అది. అందుకే విపరీతమైన పోటీ ఉంటుంది. ఛైర్మన్‌తో పాటు సభ్యుల నియామకానికి పెద్దఎత్తున రాజకీయ సిఫారసులు వస్తుంటాయి. ప్రస్తుతం అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. దీంతో హేమాహేమీలు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. రకరకాల పేర్లు బయటకు వస్తున్నాయి. అయితే చంద్రబాబు ఎవరికీ ఛాన్స్ ఇస్తారో చూడాలి.**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. టిటిడి అధ్యక్షులుగా మెగా బ్రదర్ నాగబాబు పదవీబాధ్యతలు చేపడతారని జోరుగా ప్రచారం సాగింది. కానీ ఆయన పెద్దగా సానుకూలత చూపలేదని కూడా తెలిసింది. మరోవైపు మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పేరు బలంగా వినిపించింది. ప్రస్తుతం ఆయన ఉత్తరాంధ్రలో దేవస్థానాలకు ధర్మకర్త హోదాలో ఉన్నారు. పైగా ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తున్నారు. అన్నింటికీ మించి గత వైసిపి ప్రభుత్వం అశోక్ గజపతిరాజును టార్గెట్ చేసుకుంది. రకరకాలుగా ఇబ్బంది పెట్టింది. అందుకే అశోక్ గజపతి రాజుకు టీటీడీ ఛైర్మన్ పదవి ఇస్తే గౌరవించినట్టు అవుతుందని అందరూ అభిప్రాయపడ్డారు. చంద్రబాబు సైతం సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు తాజాగా నటుడు, నిర్మాత, మాజీ ఎంపీ మురళీ మోహన్ పేరు గట్టిగా వినిపిస్తోంది. టిడిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో పని చేస్తున్నారు. ఎన్టీఆర్ పిలుపుమేరకు రాజకీయాల్లోకి వచ్చారు. వివాదరహితుడిగా కూడా పేరు ఉంది. పైగా సినీపరిశ్రమలో సీనియర్ యాక్టర్ కూడా ఆయనే. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు తరువాత మురళీమోహన్ పేరు ప్రధానంగా వినిపిస్తుంది. ప్రస్తుతం ఆయన వయసు 84 ఏళ్లు. ఈ ఎన్నికల్లో మురళీమోహన్ పోటీ చేయలేదు. టీటీడీ అధ్యక్షులుగా అవకాశం కల్పిస్తే స్వామివారి సేవ చేసుకుంటానని.. మురళీమోహన్ ఇటీవల చంద్రబాబును రిక్వెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. టీటీడీ అధ్యక్ష నియామకానికి సంబంధించి మరోవారం రోజుల్లో ఉత్తర్వులు రానున్నట్లు తెలుస్తోంది. అశోక్ గజపతిరాజు, మురళీమోహన్లలో ఒక్కరికి పదవి ఖాయమని సమాచారం. మధ్యలో ఓ టీవీ ఛానల్ అధినేత పేరు వచ్చినా.. ఆయన విషయంలో పార్టీలో అంత సానుకూలత కనిపించడం లేదు. సామాజికవర్గపరంగా కూడా ఆయన నియామకంపై అభ్యంతరాలు ఉన్నాయి. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలు ప్రత్యక్ష ఎన్నికల నుంచి దూరమయ్యారు. ఇద్దరికీ మంచి ట్రాక్ రికార్డు ఉంది. అయితే ఎవరికి చంద్రబాబు జై కొడతారో చూడాలి. మరోవైపు బిజెపితో పాటు జనసేన నేతలు సైతం టీటీడీ అధ్యక్ష పదవిని కోరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం కావడంతో నామినేటెడ్ పదవుల్లో సైతం వాటా అడుగుతున్నారు. ముఖ్యంగా బీజేపీ నుంచి సోము వీర్రాజు, జివిఎల్ నరసింహం, విష్ణువర్ధన్ రెడ్డి లాంటి నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. ఈ తరుణంలో టీటీడీ అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందో చూడాలి. కూటమి ప్రభుత్వం ఐదేళ్లపాటు అధికారంలో ఉంటుంది. అందుకే మూడు పార్టీల మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. మూడు పార్టీలు అధ్యక్ష పదవిని పంచుకునే పరిస్థితి కనిపిస్తోంది. కూటమిలో పెద్ద పార్టీగా టిడిపి ఉండడం, టీటీడీ అధ్యక్ష పదవి కీలకము కావడంతో ఆ పార్టీ వదులుకునే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

- వార్షిక లెక్కలు ప్రారంభించిన రోజు : టీటీడీ
- శ్రీరంగం నుండి శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం సాలకట్ల ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు పాల్గొన్నారు. ముందుగా ఉదయం 7 నుండి 9 గంటల వరకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్ప స్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేశారు. మరోపీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేశారు. అనంతరం ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు, బంగారువాకిలి వద్ద ఆస్థానంలో వేంచేపు చేసిన ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదించారు. అనంతరం పెద్దజీయర్‌స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేశారు. నాలుగు పట్టు వస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామివారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించారు. తదనంతరం శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో 'పరివట్టం' (చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్త్యైశ్వర్యోభవ' అని స్వామివారిని ఆశీర్వదించారు. టీటీడీ తరఫున ఈవోకి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలించారు. 'రూపాయి' హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగిసింది.

**వార్షిక లెక్కలు ప్రారంభించిన రోజు : టీటీడీ ఈవో**

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారని చెప్పారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు వచ్చిందన్నారు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవని తెలిపారు. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి – ఏప్రిల్ నెలలకు మార్చినట్టు వివరించారు. సాయంత్రం పుష్పపల్లకీపై స్వామి, అమ్మవారు నాలుగు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్ దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు, ముఖ్య అర్చకులు కిరణ్ స్వామి, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, అదనపు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

**శ్రీరంగం నుండి తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పణ**

ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం శ్రీరంగనాథస్వామి తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం ఉదయం శ్రీబేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కన గల తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి మఠంలో శ్రీవారిసారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుండి తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు, తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కలిసి పట్టువస్త్రాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా నాలుగు మాడవీధుల ప్రదక్షిణగా ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తమిళనాడు దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్, శ్రీరంగం ఆలయ ఆలయ జాయింట్ కమిషనర్ మారియప్పన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్డీకే నగర్ లో డ్రైయిన్లు నిర్మించరా..!

- ముస్సిపాలిటీకి అధిక రాబడి ఇక్కడ నుంచే
- నిమ్మకు నీరెత్తిన తీరుగా అధికారులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**



పట్టణంలోని దక్షిణ కైలాసనగర్ వాసులు సరైన మురుగునీటి వ్యవస్థ లేక అవస్థలు పడుతున్నారు. కాలనీ ఏర్పడి సుమారు 15 ఏళ్ళు గడుస్తోంది. సుమారు వెయ్యికి పైగా కుటుంబాలు ఇక్కడ నివాసం ఉంటున్నాయి. శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి అత్యధిక రెవెన్యూ ఈ ప్రాంతం నుంచే వస్తోంది. సుమారు 20 వీధుల వరకు ఇక్కడ ఉన్నాయి. ప్రధాన డ్రెయిన్ కాకుండా వీధుల్లో ఎక్కడా కాలువలు నిర్మించలేదు. దీంతో ఎక్కడ మురుగు అక్కడ వీధుల్లో నిల్వ ఉంటోంది. వర్షాలు పడితే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఎస్డీకే నగర్ ముందు వరుసలో ఉంటుంది. అయితే మౌళిక సదుపాయల కల్పనలో మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తిన చందాన వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కొత్త ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి దక్షిణ కైలాస నగర్ లో మురుగు నీటి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


**ప్రతిపాదనలు పంపాం: రమేష్ బాబు, కమిషనర్, శ్రీకాళహస్తి.**

ఎస్డీకే నగర్‌లో డ్రెయిన్ల నిర్మాణం భారీ వ్యయంతో కూడుకుంది. సుమారు రూ.10కోట్ల అంచనా ఉంది. చాలా సార్లు ప్రతిపాదనలు పంపాం. బడ్జెట్ మంజూరైతే పనులు చేపడతాం. కొత్త ప్రభుత్వంలోనైనా బడ్జెట్ ఇస్తుందని ఆశాభావంతో ఉన్నాం.

# 'చెప్పు'కోలేని ఇబ్బంది

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

ఒక్కో ప్రాంతం ఒక్కో ప్రత్యేకతకు నిలయం. అందులోనూ ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రశాంతతకు నిలయం అంటుంటారు. పంచభూత క్షేత్రాల్లో ముఖ్యమైనదిగా, రాహు కేతు పూజలకు నిలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి దేవస్థానంలో ప్రశాంతత ఏ కోశానా కనిపించడం లేదు. రాష్ట్రం, దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు విశేషంగా శ్రీకాళహస్తికి వస్తుంటారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, న్యాయమూర్తులు సైతం బారులు తీరుతూ ఉంటారు. అయితే అటు అధికారులు, ఇటు సిబ్బంది పవిత్రతను, ప్రశాంతతను కాపాడటానికి ప్రత్యేక చర్యలంటూ తీసుకోవడం లేదు. ఎంతో దూరం నుంచి వచ్చే భక్తులు ఇక్కడ వాతావరణాన్ని చూసి ఇబ్బందికి గురవుతున్నారు. ఆలయానికి వెళ్లే నాలుగు గోపురాలు వద్ద చెప్పుల కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. ప్రైవేటు దుకాణాల వారు భక్తులను నిలువునా దోచేస్తున్నారు. దేవస్థానం కాంట్రాక్టర్ ది కూడా అదే ధోరణి. దీంతో స్థానికులే కాకుండా ఇతరులు కూడా ఎక్కడ పడితే అక్కడ చెప్పలను విడిచి పెడుతున్నారు. కొన్నిచోట్ల పారిశుద్ధ్య సిబ్బంది వాటిని ఊడ్చి అవతల పారేస్తున్నారు. దీంతో ఏ చెప్పు ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి అర గంట పడుతోందని భక్తులు బాధను వ్యక్తం చేస్తున్నారు. వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా చెప్పులు స్టాండ్ కు కూడా రుసుం వసూలు చేసే దుస్థితి ఏర్పడింది. చెప్పు'కోలేని ఇబ్బందిని అధికారులు ఇప్పటికైనా గుర్తించి శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# నేడు ఏజీఎల్ తిరుపతి షోరూం ప్రారంభం

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:**




దేశంలోని ప్రముఖ టైల్స్ అండ్ మార్బల్స్ కంపెనీ అయిన ఏజీఎల్ తన నూతన షో రూమ్‌ని ఈనెల 17వ తేదీ బుధవారం తిరుపతిలో ప్రారంభించినట్లు ఆ బ్రాంచ్ అధినేత పొత్తూరు మారుతి నాయుడు, దేవేంద్ర నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నేటి ఈ పోటీ ప్రపంచంలో గృహోపకరాలంకరణలో సరికొత్త అంగుల కోసం ప్రతి ఒక్కరు ఆసక్తి చూపుతారు. వారి అభిరుచులను దృష్టిలో ఉంచుకొని ఏజీఎల్ సంస్థ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా, నేటి తరాన్ని అభిరుచులను దృష్టిలో ఉంచుకొని సరికొత్త మోడల్స్‌తో సరసమైన ధరలకు, నాణ్యత, మన్నిక గల టైల్స్, మార్బల్స్ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. దేశంలోనే ప్రముఖమైన ఏజీఎల్ సంస్థ అన్ని సైజులు, పలు రకాలు కలిగిన టైల్స్, మార్బల్స్, ఇతరాత్రవి తిరుపతి షో రూమ్ లో అందుబాటులో ఉంచడం శుభపరిణామం అన్నారు. దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పనులు త్వరితగతిన పూర్తి చేయండి: కలెక్టర్



**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సుమారు 7 ఎలక్ట్రిక్ పవర్ లైన్ టవర్లను త్వరితగతిన షిఫ్ట్ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఎస్పీడిసిఎల్ తదితర సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో రేణిగుంట ఎయిర్పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఎస్పీడిసిఎల్ తదితర అధికారులతో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రతో కలిసి ఎలక్ట్రిక్ పవర్ లైన్‌టవర్ల షిఫ్టింగ్‌పై సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు 5 టవర్లను ఆగస్ట్ 15 నాటికి, 2 సెప్టెంబర్ 2 నాటికి షిఫ్టింగ్ పూర్తి చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టైంలైన్ మేరకు సదరు పెండింగ్ అంశాలు పూర్తిచేయాలనీ కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పెంచల కిషోర్, సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**విమానాశ్రయం వద్ద లైట్లు బ్యూటిషన్ చేయండి..**

రేణిగుంట విమానాశ్రయం సంబంధించిన హార్టికల్చర్, లైటింగ్ సంబంధిత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో తుడా విసి, ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో హార్టికల్చర్ మొక్కల మెయింటెనెన్స్, బ్యూటిఫికేషన్ చర్యలు కొనసాగేలా తీసుకోవాలన్నారు. మీడియన్ లైట్ల ఏర్పాటు త్వరితగతిన ఏర్పాటు చేసి లైటింగ్ బ్లాక్ స్పాట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రహదారులు భవనాల శాఖ వారు ఎయిర్‌పోర్టు సమీప కూడలిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తుడా ఇంఛార్జి వీసీ వెంకటేశ్వరులు, ఆర్‌అండ్‌బి డీఈ నాగమల్లయ్య పాల్గొన్నారు.

# టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి నియామకం



**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమల తిరుపతి దేవస్థానం నూతన జేఈవోగా చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి నియమితులయ్యారు. ఆయన 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి. వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్‌పై పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఆయన ఏపీలో మూడేళ్ల పాటు పనిచేయనున్నారు. ఆయన గతంలో ఏపీ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్, ఎండీగా పనిచేశారు. అటు, 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణను కూడా కేంద్రం ఏపీకి పంపించింది. రవికృష్ణ ప్రస్తుతం కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్నారు. రవికృష్ణ గతంలో కర్నూలు జిల్లా ఎస్పీగా వ్యవహరించారు. యూపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి ఏవీ రాజమౌళిని కూడా కేంద్రం ఏపీకి డిప్యుటేషన్ పై పంపింది. రాజమౌళి 2014-19లో ఏపీ సీఎంవోలో పనిచేశారు. తాజాగా, ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఆయనను రాష్ట్రానికి పంపేందుకు ఆమోదం తెలిపింది. రాజమౌళి ప్రస్తుతం యూపీ హోంశాఖ కార్యదర్శిగా ఉన్నారు.

# విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం

**గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్**

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**



గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులందరికీ ఆరోగ్య పరిస్థితి బాగుందని వైద్యులు ఎప్పటికప్పుడు పరీక్షల నిర్వహిస్తున్నారని గూడూరు ఆర్టీవో కిరణ్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల పాఠశాల విద్యార్థులను గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో పిల్లల ఆరోగ్య పరిస్థితిపై చర్చించారు. ఆర్టీవో మాట్లాడుతూ కలుషితమైన ఆహారం తినడంతో పిల్లలు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని 30మంది విద్యార్థులకు గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం చిన్నారుల పరిస్థితి బాగుందని ఇద్దరిని నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కి పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారని శానిటేషన్ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కౌన్సిల్ సమావేశాల్లో ప్రోటోకాల్ పాటించండి

- టిడిఆర్ బాండ్ల అవినీతి ఏం చేశారు..
- ఫాగింగ్ మిషన్లు పనిచేస్తున్నాయా..
- తొలిసారిగా మేయర్ హోదాలో సమీక్షించిన శిరీష



**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** గత మూడు సంవత్సరాలుగా స్వేచ్ఛగా మాట్లాడలేక కార్పొరేషన్ జరుగుతున్న అవినీతి ఆరోపణ ప్రశ్నించలేని పరిస్థితి నుంచి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో అధికారులపై ప్రశ్నల వర్షాన్ని మేయర్ శిరీష సంధిస్తున్నారు. తొలిసారిగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని విసి హాల్లో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలు కార్పొరేషన్‌పై జరుగుతున్న ఆరోపణలపై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దశదిశ నిర్దేశించారు. కౌన్సిల్ సమావేశంలో అధికారులు వ్యవహరించాల్సిన తీరుపట్ల ఆమె గత మూడేళ్ల నుంచి అసంతృప్తిగా వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈసారి కౌన్సిల్ సమావేశంలో తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించడమే కాకుండా అధికారాలు చట్టాలను కార్పొరేటర్లకు తెలియజేసేలా అధికారులు పనులు చేయాలని సూచించారు. కౌన్సిల్ సమావేశం జరక్కముందు అజెండా కాపీలను నాలుగు రోజులు ముందే కార్పొరేటర్లకు తనకు ఇవ్వాలని సూచించారు. గతంలో ఆరోజుకు కారోజు అజెండా కాపీలు ఇవ్వడం పట్ల తమకు చదువుకోవడానికి సమయం దొరకడమే కాకుండా కౌన్సిల్లో ఏం చర్చించాలో తెలియని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. చాలామంది కార్పొరేటర్లు కూడా అజెండా కాపీలు ప్రోటోకాల్ పద్ధతిని పాటించడం లేదని తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఇకపై ప్రోటోకాల్ తప్పనిసరి పాటించాలని కమిషనర్ అదితి సింగ్‌ను ఆదేశించారు. నగరంలో ఎక్కడ దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేసినట్లు కనపడటం లేదని మేయర్ అన్నారు. కార్పొరేషన్‌లో ఎన్ని ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి.. ఎన్ని రిపేర్లు ఉన్నాయి.. దాన్ని బాధ్యులు ఎవరని ప్రశ్నించడం జరిగింది. వర్షాకాలం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురుగు కాలువలు పూడికతీత పనులను వేగంగా చేయాలని ఆదేశించారు. మురికివాడ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా చేపట్టేలా చూడాలన్నారు. వర్షం వస్తే ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయి ఉండడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వర్షపు నీరు రోడ్లపై ఆగకుండా ఉండే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సర్కిల్ ఐలాండ్ వద్ద వర్షపునీరు ఆగి ఉండటం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. టిడిఆర్ బాండ్లు అర్హులకు ఎప్పుడు ఇస్తారని, గతంలో ఇచ్చిన టిడిఆర్ బాండ్ల అవినీతి జరిగిందని పత్రికల్లో రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారని అధికారులు దానికి తగ్గట్టు సమాధానం ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. టిడిఆర్ బాండ్లు అర్హులకు ఇవ్వడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని సూచించారు. ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, రామచంద్రగుంట మార్కెట్ పార్కింగ్ వేలంలో అధికారులు ఇతరులతో కుమ్మక్కై టెండర్లు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని పత్రికల్లో రావడం జరిగిందని అర్హులైన వారికి టెండర్లు ఇచ్చి మున్సిపల్ ఖజానా నింపేందుకు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు కాంట్రాక్టర్ల బిల్లులు కూడా సకాలంలో ఇచ్చే విధంగా పరిశీలించాలని కమిషనర్‌కు మేయర్ సూచించారు. తిరుపతికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ పథకంలో చేపట్టే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ అదితి సింగ్, అడిషనల్ కమిషనర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని గమళ్లపాలెం ప్రాంతంలో ఉన్న ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పది అన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సారించాలి అన్నారు. కార్యక్రమంలో మహేశ్వర్, హోమ్ టేకర్ కళ్యాణి పాల్గొన్నారు.

**వీరభద్రుని ఆలయంలో..**

పట్టణంలోని వీర భద్రుని ఆలయంలో దాతలు అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మురు ముని మోహన్ మాట్లాడుతూ దాత సహకారంతో ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నమన్నారు. కార్యక్రమానికి దాతలుగా పెళ్లూరు అమరావతి కుటుంబ సభ్యులు ఉదయ్ భాస్కర్, దుర్గా దేవిలు వ్యవహరించారు.

## ఫల సరుకుల వితరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆధ్వర్యంలో ఫల సరుకులు వితరణ చేపట్టారు. అనంతరం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచు కోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు టౌన్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం యాదవ్, సెక్రటరీ శీనయ్య, ట్రెజరర్ పసుపులేటి ప్రసాద్, గోపినాథ్ రెడ్డి, ఆర్.వి.రావు, ఎంఎల్ఎన్ స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, మురళి నాయుడు, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-క్యాంపస్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-2026 విద్యా సంవత్సరంలో గాను ఆరో తరగతి నోటిఫికేషన్ వెలువడింది. తిరుపతి విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్ర అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధిస్తే అత్యున్నత ప్రమాణాలతో సీబీఎస్ఈ సిలబస్తో ఉచితంగా చదువు, వసతి, భోజనం కల్పిస్తారు, రెగ్యులర్ చదువుతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలకు కూడా శిక్షణ ఇస్తున్నారు అని తెలిపారు. ఈ జవహర్ నవోదయాలు దేశవ్యాప్తంగా 653 ఉన్నాయి, వీటిలో ఏపీలో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్ఠంగా 80మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. 2025-2026 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్నవారు జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్టు (జేఎన్వీఎస్టీ) రాయడానికి అర్హులు అని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష 18 జనవరి 2025న, దరఖాస్తులు సమర్పించుటకు చివరి తేదీ 16విని తెలిపారు. పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కొరకు 8688888802, 9399976999 నంబర్లను సంప్రదించగలరని కోరారు.

## కుష్టు వ్యాధి నివారణకు చర్యలు

- డాక్టర్ ప్రియాంక

ప్రజాశక్తి-చంద్రగిరి: శరీరంపై స్పర్శ లేని రాగి వర్ణపు మచ్చలు కుష్టు వ్యాధి కావచ్చు అని డాక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో చంద్రగిరి హాస్పిటల్లో మంగళవారం లెప్రసీ కేస్ నిర్ధారణపై సూపర్వైజర్లు ఎంఎల్హెచ్పి ఏఎన్ఎం ఆశాలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంపై 18 నుంచి 02వ తేదీ వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు డాక్టర్ తెలిపారు. ప్రారంభ దశ లోనే గుర్తించి చికిత్స పొందితే అంగ వైకల్యం రాకుండా నివారించ వచ్చని ఆమె పేర్కొన్నారు. డాక్టర్ కుసుమ ప్రసంగిస్తూ చర్మంపై వివిధమైన మచ్చలు ఉన్నా ఆశాలకు చూపించి పరీక్షలు చేయించు కోవాలని కోరారు. ఈ శిక్షణ కాలంలో ఇంటింటా సర్వేకు ఆశాలు వాలంటీర్లు వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. డెంగీ మాసోత్సవం సందర్భంగా బి.డి. కాలనీలో అవగాహన, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి యు.శివయ్య, సూపర్వైజర్ ఎన్.వాసుదేవ, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): సిమ్స్లోని శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో చంద్రగిరి మండలం మల్లయ్యపల్లి గ్రామంలో సోమవారం మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ద్వారా నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామీణ ప్రాంత ప్రజలు క్యాన్సర్పై అవగాహన కలిగి ఉండాలని క్యాన్సర్ కారణాలైన వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా మత్తుపదార్థాలు ధూమపానం, మద్యం, పొగాకు సేవించడం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం చేయించుకోవడం కన్నా వ్యాధి రాకుండా ఉండటానికి తగు సూచనలను సలహాలను అందించారు. టీడీపీ నాయకులు బీరాల మహేష్ స్థానిక ప్రజలను ప్రోత్సహించి వ్యాధి నిర్ధారణ పరీక్షలకు హాజరవచేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓలు అపర్ణ, గీత, నవీన, ఎఎన్ఎం డి.మంజుల, ఆశా కార్యకర్తలు అరుణ, లక్ష్మీకాంత, సునీత, సర్పంచ్ గౌతమి, ఉపసర్పంచ్ మురళి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, మునిరత్నం రాయల్, చంద్రశేఖర్ రాయల్ (బిట్టి), వెంకటేశ్వర్లు (బాబు), మానస సిబ్బంది పాల్గొన్నారు.

## నాగుపాముల హల్చల్

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న భవనంలో నాగుపాము హల్చల్ చేసింది. ఆదివారంనాడు మరో ఇంట్లో వంటగదిలో మరో నాగుపాము కనిపించింది. ఇంటి యజమానులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ అయ్యారు. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న స్నేక్ క్యాచర్ శ్రీకాంత్ ఆ పాములను చాకచక్యంగా పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో అక్కడి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## బ్యాంకర్స్తో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని విప్పమాని పట్టెడ పంచాయతీలో బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే రైతులకు సబ్సిడీపై లోన్లు, తలసరి అభివృద్ధిని పెంచుకొనుటకు సలహాలను సర్పంచ్ డాక్టర్ లక్ష్మీపతి రెడ్డి సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

# రోడ్డంతా గుంతలు.. తప్పని వెతలు





- కుంటలు తలపిస్తున్న అనుపల్లి - రాయలచెరువు రోడ్డు
- నరకయాతన అనుభవిస్తున్న వాహన చోదకులు
- అత్యంత ప్రమాదకరంగా మలుపులు
- పట్టించుకోని ఆర్అండ్బి అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు – అనుపల్లి ఆర్అండ్బి రోడ్డు కుంటలను తలపిస్తున్నది. ఆ రోడ్ల ప్రయాణిం చాలంటే వాహన చోదకులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని వాహనాలను నడపాల్సి వస్తోంది. ఆ రోడ్డు మార్గం గత ఐదేళ్లగా అభివృద్ధికి నోచుకోక తాత్కాలిక మరమ్మతులతోనే ఆర్అండ్బి అధికా రులు సరి పెట్టారు. వర్షాలు వస్తే ఆ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి నీటి కుంటలను తలపించేలా ఉంది. వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆ రోడ్డులో వాహన చోదకులు ప్రయాణించాలంటే నరకయా దన అనుభవించక తప్పదు. ఆ రోడ్డు మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వేణుగోపా లపురం వద్ద ఉన్న ప్రమాదకరమైన మలుపు సుమారు పదిమంది ప్రాణాలను తీసింది. మలుపుల సమీపాన సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధి గురించి పదేళ్లగా ప్రజా ప్రతినిధిగా వ్యవహరించి పాలన సాగించిన పాలకుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డు మార్గం అంటేనే పాలకులు నిర్లక్ష్యంగా చూస్తున్నారని వాహన చోదకులు అంటున్నారు. ఈ రోడ్డు మార్గంలో తిరుపతి పట్టణంలో ఉపాధి, కూరగాయల వ్యాపారం, కూలీ పనుల కోసం కూలీలు, చదువుల కోసం విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసం గత పాలకులు పట్టించుకోకపోవడం విచారకరమని ప్రయాణికులు అంటున్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నాని ఆ రోడ్డు అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా.. తాత్కాలిక మరమ్మతులైన చేయించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. లేకపోతే దాతలు ఎవరైనా ముందుకొచ్చి ఆ రోడ్డు మార్గంలోని గుంతలను పూడ్చి ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

# రాజకీయ కక్షసాధింపులు మానుకోవాలని నిరసన



ప్రజాశక్తి-బాలాయపల్లి: అధికారపార్టీ నాయకులు మండలంలోని సుబ్రమణ్యం గ్రామ దళిత ఆశవర్కర్ కస్తూరి కృష్ణవేణిపై రాజకీయ కక్షసాదింపులు మానుకోవాలని ఏ.పీ ఆశావర్కర్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహశీల్దార్, ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే 18ఏళ్ళ నుంచి వైద్య సేవలు అందించిన కృష్ణవేణిని విధుల నుంచి తొలగించాలని కక్ష సాధింపు చర్యలకు అధికార పార్టీ నాయకులు పూనుకోవడం బెదిరింపు చర్యలు చేయడం జరుగుతుందని తెలిపారు. ముగ్గురు పిల్లలు ఒక పాప క్యాన్సర్ వ్యాధితో గత మూడు నెలలు క్రితం మృతి చెందింది సోక సముద్రంలో ఉన్న కృష్ణవేణిని ఆశవర్కర్ నుంచి టీడీపీ నాయకులు తొలగించమని డాక్టర్కి హుకూం జారీ చేశారన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు లెక్క చేయకుండా పేదల కోసం అనేక సేవలు అందించిన ఆశ వర్కర్ని తొలగించాలని రాజకీయ నాయకులు ఆలోచన రావడం తగదని మండిపడ్డారు. కృష్ణవేణి తొలగించాలని మానుకో కపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ల తిరుపతి జిల్లా అధ్యక్షురాలు కవిత, ఏపీ ఆశావర్కర్ యూనియన్ బాలాయపల్లి మండల అధ్యక్షురాలు సుహాసిని, ఆశవర్కర్ కె.గోపిమ్మలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ముగ్గురి సస్పెన్షన్

**విద్యార్థి మృతి ఘటనపై చర్యలు తీసుకున్న అధికారులు**

ప్రజాశక్తి- డక్కిలి : స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థిని అడసనపల్లి షరీనా మృతి ఘటనకు సంబంధించి ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు ఉన్నతాధికారుల నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్లు సమాచారం. పాఠశాలలో అనారోగ్యానికి గురైన షరీనాను ఈ నెల 9వ తేదీన గురుకుల ఉద్యోగులు తల్లిదండ్రులకు అప్పగించారు. వారు వెంటనే రాపూరు, నెల్లూరు, అనంతరం చెన్నై ఎగ్మూర్ చిన్నపిల్లల ఆస్పత్రిలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ బాలిక మృతి చెందిన ఘటన పాఠకులకు విధితమే. ఈ సంఘటనపై ఎంఆర్పీఎస్, ప్రజాసంఘాల ఐక్యవేదిక, పలు ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. దీంతో ఈ ఘటనపై తిరుపతి జిల్లా గురుకుల పాఠశాల, కళాశాలల కన్వీనర్ పద్మజ, జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవీ, జిల్లా వైద్యాధికారి శ్రీహరిల బృందం క్షేత్రస్థాయిలో విచారించి జిల్లా కలెక్టర్కు నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా గురుకులంలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి, నర్సు సునీత, హౌస్ టీచర్ వాణిలను సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## యోగా పోటీల్లో సుజాతకు మొదటి స్థానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బెంగళూరులో జరిగిన అంతర్రాష్ట్ర యోగ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఆయిలం సుజాత విశేష ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచింది. కర్నాటక స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ దినోత్సవంను పురస్కరించుకొని ఈ నెల 14వ యోగా పోటీలు నిర్వహించారు. పట్టణంలోని జయరాం రావు వీధిలో శ్రీ శివ సాయి యోగా సెంటర్ నడుపుతున్న ఆయిలం సుజాత ఎంతో మందికి శిక్షణ అందిస్తున్నారు. ఇదే ఈ పోటీల్లో శ్రీ శివ సాయి యోగా సెంటర్ నందు శిక్షణ పొందిన సోహిత కూడా రెండవ స్థానం, నవనీత్ మూడవ స్థానం సాధించారు.

## మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన

**- 150 మందికి ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ**



ప్రజాశక్తి -వరదయ్యపాలెం: శ్రీసిటీ, ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో మంగళవారం శ్రీసిటీలో నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. 10 ప్రముఖ పరిశ్రమలతో పాటు 2022, 2023, 2024లో ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ ఉత్తీర్ణులైన సుమారు 400 మంది ఈ మేళాలో పాల్గొన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 363 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి అభ్యర్థులు రాగ, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి ఎక్కువ మంది తరలివచ్చారు. ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేసిన 150 మంది అభ్యర్థులకు ఆయా కంపెనీలు వెంటనే ఉద్యోగ నియామక పత్రాలను అందచేశాయి. ఉద్యోగ అన్వేషనలో వున్న అర్హత కలిగిన అభ్యర్థులను శ్రీసిటీ పరిశ్రమలతో అనుసంధానం చేసేందుకు రూపొందించబడిన ఈ నియామక కార్యక్రమంలో ఎంపిక ప్రక్రియ కోసం అధునాతన సాంకేతికతను వినియోగించారు. మేళాలో భాగస్వామ్యులైన ఏఎల్ఎఫ్ ఇంజినీరింగ్, ఎన్ఎస్ నిప్పన్ సెయికి, బ్రేక్స్ ఇండియా, డైకిన్, ఆక్సిలెంట్ ఫార్మా, టోరే, ఆస్ట్రోటెక్ స్టీల్స్, సుందరం ఫాస్టెనర్స్, ఆల్స్టోమ్తో సహా పలు పారిశ్రామిక సంస్థలు, కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చక్కగా ఉపయోగించుకున్నాయి. ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ వారి స్మార్ట్ సాంకేతికత ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించింది. ఒకే రోజులో వివిధ కళాశాలల నుండి పెద్దసంఖ్యలో విభిన్నప్రతిభ కలిగిన అభ్యర్థులను కంపెనీలు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించింది. ఈ విధానం నియామక ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు కంపెనీల అంచనాల పట్ల విద్యార్థులకు అవగాహనను, విలువైన సమాచారాన్ని అందించింది శ్రీసిటీలోని కంపెనీలు మానవ వనరుల కోసం పెట్టుబడి పెట్టడాన్ని తాను స్వాగతిస్తానని, సంస్థల నిరంతర వృద్ధికి ఇది చాలా అవసరమని తాను విశ్వసిస్తానంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ భాగస్వామ్యంతో పరిశ్రమ డిమాండ్కు అనుగుణంగా ఈ ప్రాంతంలోని యువత ప్రతిభను పెంపొందించే లక్ష్యంగా తాము కృషి చేస్తామన్నారు. సరైన అవకాశాలను కోరుకునే అర్హత కలిగిన అభ్యర్థులను పరిశ్రమలకు అందించే ఈ కార్యక్రమం తమకెంతో ఉత్సాహాన్ని, సంతోషాన్ని ఇచ్చిందంటూ ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ సీఈఓ ఇమ్మాన్యుయేల్ జస్టస్ పేర్కొన్నారు.

## జాబ్ మేళాలో 22మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఏఐ, ఎంఎన్సి కంపెనీలో ఉద్యోగాలకు 140మంది పాల్గొన్నారు. వివిధ దశలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 22మంది అభ్యర్థులు ఎంపికైనట్లు మ్యాజిక్ బస్ ఫౌండేషన్ చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ పి.వెంకట ప్రసాద్ తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులకు ఎచ్ఆర్ మేనేజర్లు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ విద్యా కళాశాల చైర్మన్ డాక్టర్ జి.ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ యం.మాణిక్యం, అధ్యాపకులు పాల్గొని ఉద్యోగాలకు ఎన్నికైన అభ్యర్థులను అభినందించారు.

## 'ఉచిత ట్యూషన్ సెంటర్' ప్రారంభం



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట ఏఎన్ఆర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు పేద విద్యార్థులకు తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన వేదిక రేణిగుంట మండల నాయకులు ఓ.వెంకటరమణ, కుప్పస్వామి, ఇమామ్ ఆధ్వర్యంలో సాయంత్రం ఐదు గంటలకు 'సావిత్రిబాయి పూలే ఉచిత ట్యూషన్ సెంటర్'ను ప్రారంభించడం జరిగింది. తిరుపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, తిరుపతి వేమనవిజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, బాలోత్సవం అధ్యక్షులు నడ్డి నారాయణ, జెవివి నాయకులు ఎండి రఫీ, లెక్కలు మాస్టర్ అల్లాబక్ష, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెల్పింగ్ టు అదర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మణికంత, రఘునాథ్, మదన్మోహన్, స్ఫూర్తి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సుబ్రహ్మణ్యం, సపోర్ట్ వ్యవస్థాపకురాలు తహసిన్నిసా, హెచ్ఎం వసుమతి పాల్గొన్నారు.

# రోడ్ల అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే



ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గంలో దుస్థితిలో ఉన్న అన్నీ రోడ్లు అభివృద్ధికి సహకరించాలని పంచాయతీరాజ్, ఆర్అండ్బి ఇంజనీరింగ్ ఉన్నతాధికారులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం తిరుపతిలోని ఇంజనీరింగ్ డివిజనల్ కార్యాలయంలో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులతో ఎమ్మెల్యే సమావేశమైయ్యారు.

తిరుపతి డెస్క్: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టి పెండింగ్ క్లెయిమ్స్ నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని ఏపీ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, చంద్రబాబు సమస్యలు పరిష్కరించాలని కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కార్మికులు ప్రతినిధి బృందంతో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు, పురుషోత్తం రెడ్డి, కోటి బాబు, చిరంజీవి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం సమస్యలపై అనునిత్యం చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరిలోని రాయలపురం, నూకలగుంట నుంచి విజయనగర్ కాలనీ మీదుగా తొండవాడ డ్రైనేజీ కాలువలోకి డ్రైనేజ్ని కలిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. పంచాయతీ పరిధిలో రోడ్లు మరమ్మతులను చేసేటప్పుడు మురుగు కాలువలు కూడా కచ్చితంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం కావడంతో రోడ్లలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్బి అధికారులకు సూచించారు. రెవెన్యూ పంచాయతీ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించి తొందరగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా దీర్ఘకాలిక సమస్యలు ఉంటే మండల నాయకుల ద్వారా తన దృష్టికి తీసుకువచ్చి సమస్యను త్వరితగతిన పరిష్కరించు కోవాల్సిందిగా ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌస్ బాషా, రమేష్ రెడ్డి, మునిరత్నం రాయల్, సుబ్రహ్మణ్యం నాయుడు, వేణుగోపాల్, ఎంపీడీవో వివి సూర్యసాయి, పిఓపిఆర్డి శశిరేఖ, పంచాయతీరాజ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులపై సీఎంకి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సహకరించాలని సిఎంఓ కార్యాలయంలో సీఎం చంద్రబాబుని నగరి ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ నగిరి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, పరిశ్రమలు, పెండింగ్లో ఆగిపోయిన ప్రాజెక్టు పనులు, హాస్పిటల్ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. అందుకు ముఖ్యమంత్రి స్పందించి నియోజకవర్గంలో కావలసిన అభివృద్ధి పనులకు వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

# జిపిఎస్పై గెజిట్ ఉపసంహరించుకోవాలి: ఏబిఆర్ఎస్ఎం

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి గత ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన జీవో ఎంఎస్ నెంబర్ 54 గ్యారెంటీ పెన్షన్ స్కీంకు అధికార ముద్ర వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల ఏబిఆర్ఎస్ఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ గెజిట్ నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా రూపొందించిన జిపిఎస్ను ప్రస్తుత ప్రభుత్వంలోని పెద్దలు కూడా తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని ఏబిఆర్ఎస్ఎం ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉన్నట్లయితే ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకొని సిపిఎస్ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నదని తెలిపారు.

## పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో: పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి శాంతి మంగళవారం తీర్పునిచ్చారు. కాగా 2020లో పుత్తూరు పోలీస్స్టేషన్లో 163/2020 పోస్కో ఆక్ట్ నమోదైన కేసులో ముద్దాయి పుత్తూరు మండలం, గొల్లపల్లి గ్రామానికి చెందిన గంజి శ్రీరాములుపై నేరం బుజువు అయినందున, జడ్జి ముద్దాయికి 3 ఏళ్ల జైలు శిక్ష రూ.2,500 జరిమానా విధించారు.

# మాతాశిశు సంరక్షణ చర్యలు పాటించాలి: శ్రీనివాసరావు



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైద్య సిబ్బంది ఆయా పరిధిలో మాతా శిశు సంరక్షణ చర్యలను కచ్చితంగా పాటించాలని, గర్భిణీ స్త్రీలకు మాతశిశు సంరక్షణ కార్డులను తప్పనిసరిగా ఇవ్వాలని డిపిఎమ్ఓ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీ హెల్త్ సెంటర్ను జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు పరిశీలించారు. గర్భిణీ స్త్రీల రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణీలతో నేరుగా ముఖాముఖి నిర్వహించి తగు జాగ్రత్త చర్యలను వివరించారు. గర్భిణీలు ప్రతి మాసం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రజలు దోమతెరలను వినియోగించాలని, ఫ్రైడే డ్రై డేను పాటించాలని కోరారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సభ్యులు నాగేంద్ర కుమార్, బేబీ రాణి, పి.ప్రకాష్, మంగళం పిహెచ్సి వైద్యాధికారిని జయంతి, సీహెచ్ఓ అమరావతి, సూపర్వైజర్లు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఇసుక కష్టాలు తీరేలా చర్యలు తీసుకోవాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ప్రజలకు ఇసుక కష్టాలు తీరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్లుకు సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక పాలసీతో జిల్లా వాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఆయా ర్యాంపులు చుట్టూ వినియోగదారులు తిరుగుతున్నా అక్కడి అధికారులు రోజుకో కొత్త నిబంధనల మార్పు పేరుతో వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారు ఉచిత ఇసుక కోసం మునిసిపాలిటీ, పంచాయతీలు ఇచ్చే ప్లాన్ అప్రూవల్ కొరకు ఆధార్ కార్డు తీసుకురావాలని ప్రభుత్వం చెబుతుందని, వాటిని తీసుకొని ర్యాంపుల వద్దకు వెళ్లగా అక్కడి అధికారులు కొత్తగా చెప్పే నిబంధనలతో తీవ్ర అసహనానికి గురవుతున్నామని వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిర్మాణరంగంపై రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25లక్షల మంది ఆధారపడి ఉన్నారని, ఒక్కరోజు ఇసుక కొరత ఏర్పడిన వారి జీవనోపాధి దెబ్బతింటుంది. కావున తమరు ఇసుకకు సంబంధించి జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడగలని కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు సిహెచ్ శివకుమార్, ఉదయ్ కుమార్, ముని పాల్గొన్నారు.

# చంద్రగిరి అభివృద్ధి వైపు ఎమ్మెల్యే అడుగులు

- అంతిమ సంస్కారాల కోసం గోవింద ధామం
- చంద్రగిరిలో ఆర్టీసీ డిపోకు స్థలం పరిశీలన
- నివేదిక తయారీకి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



ఆర్టీసీ డిపో ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి ఎమ్మెల్యే పులివర్తి నాని వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి చంద్రగిరి–శ్రీనివాస మంగాపురం రహదారికి నరసింగాపురం సమీపంలో స్వర్ణముఖి గట్టున గోవింద ధామం ఏర్పాటు చేయటానికి స్థలం పరిశీలించి, పనుల చేయటానికి చర్యలు తీసుకున్నారు. గోవింద ధామంలో చక్కటి గార్డెన్ కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తమన్నరు. అలానే ఆర్టీసీ డిపోను ఏర్పటు చేయటానికి 5ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. డిపో ఏర్పాటుకు వెంటనే నివేదికలు తయారు చేయాలని అధికారులను కోరారు. చంద్రగిరి మండల పార్టీ అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి హేమాంబరధరావు, ఏజిపల్లి బాల, గౌస్ బాషా, రమేష్రెడ్డి, మునిరత్నం రాయల్, వేణుగోపాల్ ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## 'స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: డిక్సన్ నుంచి టీసీల్ వరకు వున్న రోడ్ మీద ఇప్పుడు కంపెనీలో పని చేసే ఉద్యగులు వారు ప్రయాణించే బస్లు, పరిశ్రమల అవసరాల కోసం వచ్చే భారీ వాహనాలతో అధికి రద్దీ అయింది. దీనితో వికృతమాల టీసీల్ సెంటర్ ప్రమాదాల జరిగే అవకాశం ఉంది. ఈ రోడ్ మీద నుండే ఇఎంసి-1, ఇఎంసి-2లో వున్న 50పైబడి పరిశ్రమల ఉద్యోగులు, పరిసర గ్రామల ప్రజలు ప్రయాణిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా రోడ్కి అన్నివైపులా స్పీడ్ బ్రేకర్స్, ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని వికృతమాల మాజీ సర్పంచ్ హేమాక్షి, ఏర్పేడు జెడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య కలిసి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్కి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంటనే సందిత అధికారులను పంపి రోడ్ పరిశీలించ రెండు మూడు రోజుల్లో స్పీడ్ బ్రేకర్స్, ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-తడ: తడ బజారు వీధిలో ఓ వ్యక్తిపై హత్యా ప్రయత్నం జరిగింది. మంగళవారం పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. నీలపు మౌనిక, రవీంద్రలు భార్య భర్తలు. వీరికి పెళ్లై 10ఏళ్లు అయింది. ఇద్దరు పిల్లలున్నారు. భర్త రవీంద్రతో మనస్పర్థాలు వచ్చి విడిపోయి. తునికి చెందిన సతీష్కుమార్తో పరిచయమై 4నెలలుగా మౌనిక సహజీవనం చేస్తున్నట్లు తెలిపారు. కాగా మౌనిక సతీష్కుమార్లు తడ హైస్కూల్ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నట్లు చెప్పారు. ఈ విషయంగా ఆగ్రహించిన రవీంద్ర కొంతకాలంగా మౌనిక, సతీష్ల కోసం వెతుకుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. కాగా మంగళవారం ఉదయం సతీష్కుమార్ డైకిన్ కంపెనీలో డ్యూటీకి వెళ్లేందుకు నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ముఖంపై రాడ్డుతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సతీష్ని ఆసుపత్రికి తరలించారు. ఆమేరకు మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తీవ్ర రక్తగాయాలతో ఉన్న సతీష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బి నెగిటివ్ రక్తం అవసరం కావడంతో ఏఎస్ఐ కుమార్రెడ్డి సహకరించారు.

## కుక్కల దాడిలో దూడలకు గాయాలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని కడగుంట గ్రామంలో మంగళవారం ఉదయం మేత కోసం వేళుతున్న సమయంలో గేదెదూడలను కుక్కలు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాయి. గాయపడ్డ దూడలను బాలాయపల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పశువైద్యాశాలలో పశు వైద్యాధికారి సుధీర్ వైద్యసేవలు చేసి ప్రాణాలు కాపాడడు. కుటుంబ గ్రామంలో కుక్కలు ముగజీవులపై దాడిచేయడం జరుగుతుంది. జిల్లా అధికారులు స్పందించి వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. సచివాలయం పశువైద్యా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి